నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I | హైదరాబాద్, మంగళవారం 17 సెప్టెంబర్ 2024 | VIKARABAD











వంట నూనెల దగ్గర్నుంచి సబ్బుల వరకూ మనం రోజువారీ ఉపయోగించే సరుకు ఏదైనా సరే..వాటి ధర పైపైకి చేరుతున్నది. పెరిగిన నిత్యావసర, కూరగాయల ధరలు ప్రజానీకంపై మరింత భారాన్ని మోపుతున్నాయి. దీంతో సగటు కుటుంబం ఖర్చు రెండింతలు అయింది. భరించలేని స్థాయికి చేరడంతో ఇతర ఖర్చుల్లో కోత పెట్టుకోవడంతోపాటు పొదుపునూ తగ్గించాల్సి వస్తున్నది. అడ్డూఅదుపు లేకుండా పెరిగిపోతున్న ధరలతో సగటు జీవి బతుకులు జిల్లాలో ఆగమాగం అవుతున్నాయి. మధ్యతరగతి వర్గాల కొనుగోలు శక్తి నానాటికీ దిగజారి పోతున్నదని విశ్లేషకులు చెబుతున్నారు.

- రంగారెడ్డి, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ)

# ధరల దడ

- నిత్యావసర ధరలకు రెక్కలు
- ఘాటెక్కిన ఉల్లి.. కాగుతున్న నూనె
- భగ్గుమంటున్న కూరగాయల ధరలు
- సగటు కుటుంబం ఖర్చు రెండింతలు
- జిల్లాలో ఆగమాగం అవుతున్న సగటు జీవి బతుకు

ఏ వంటకంలోనైనా నూనె తప్పనిసరి. అయితే ప్రస్తుతం నూనెలకూ ధరల సెగ తగిలింది. నాలుగు రోజుల కిందటి వరకు మార్కెట్‌లో రూ.1600 ఉన్న 15 లీటర్ల వంట నూనె డబ్బా ధర ప్రస్తుతం రూ.1800కి పెరిగింది. పూజకు ఉపయోగించే నూనె ధర సైతం నిన్నమొన్నటివరకు లీటర్ ప్యాకెట్ ధర రూ.100 ఉండగా నేడు రూ.120కి చేరింది. కందిపప్పు కిలో రూ.180, శనగపప్పు కిలో రూ.110, జిలుకర కిలో రూ.300గా ఉన్నది. ఇక వంటకాలకు ఘుమఘుమలను జోడించే మసాలాల ధరలు సైతం ఘాటెక్కాయి. జిల్లాలో మాంసాహార వినియోగం ఎక్కువే. అల్లం, వెల్లుల్లి, ఉల్లిగడ్డలతోపాటు మసాలా లేకుండా మాంసాహార వంటకాలు తయారు చేయడం కుదరదు. శాకాహార వంటకాలకు మసాలా ఫ్లేవర్ ఉండాల్సిందే. అయితే రూ.300 వరకు ఉన్న వెల్లుల్లి ధర ప్రస్తుతం మార్కెట్‌లో రూ.420కి దొరుకుతున్నది. రూ.150 ఉన్న కిలో అల్లం ధర రూ.200లకు చేరింది. రూ. వంద కు నాలుగు కిలోలు వచ్చే ఉల్గిగడ్డ ప్రస్తుతం అమాంతం పెరిగిపోయి కిలోకు రూ.80 ధర పలుకుతున్నది. ఇలాచీలు కిలో మొన్నటివరకు రూ.వెయ్యి ఉండగా రూ.1200లకు ఎగబాకింది. దాల్చిన చెక్క ధర సైతం రూ.200ల నుంచి ఏకంగా రూ.350 కి పెరిగింది. సన్నబియ్యం ధర సైతం రోజురోజుకూ పెరుగుతున్నది. ప్రస్తుతానికి క్వింటాలు బియ్యం బస్తా ధర రూ.6వేలకు పైనే ఉంది.

## కొనలేం..తినలేం..

ఇటీవల కురిసిన వర్షాలు, వరదలు కూరగాయల ధరలపై ప్రభావం చూపుతు న్నాయి. వర్షాలకు ముందు ఉన్న ధరలతో పోలిస్తే ప్రస్తుతం రెట్టింపు అయ్యాయి. వేసవితో పోలిస్తే ప్రస్తుతం కూరగాయల ధరలు తక్కువగా ఉంటాయి. కానీ..ఈ సీజన్‌లోనూ కూరగాయల ధరలు మండిపోతున్న విచిత్ర పరిస్థితి నెలకొంది. కూర గాయలు, ఆకు కూరలను కొనడం సామాన్యులకు ఇబ్బందిగా మారింది.

వర్షాలకు ముందు, ప్రస్తుతం ఉన్న కూరగాయల ధరలు (కిలోకు రూ.లలో)..

| కూరగాయలు | గత నెలలో | ప్రస్తుతం |
|---|---|---|
| టమాట | 20 | 40 |
| వంకాయ | 20 | 66 |
| బెండకాయ | 20 | 66 |
| కాకర | 26 | 66 |
| బోడ కాకర | 140 | 150 |
| బీర | 46 | 58 |
| దొండ | 26 | 46 |
| పొట్లకాయ | 30 | 60 |
| చిక్కుడు | 50 | 96 |
| క్యారెట్ | 40 | 56 |

## ప్రజలపై ఆర్థికభారం..

సగటు మనిషి ఆదాయం 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందాన ఉన్నప్పటికీ నిత్యావసరాలు, కూరగాయల ధరలు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో జిల్లా ప్రజలపై పెరిగిన ధరలు మరింత ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. ఒక పక్క ఇంటి అద్దెలు..మరోపక్క పిల్లల చదువులు..ఇంకోపక్క అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న ప్రజానీకానికి పెరిగిన నిత్యావసర, భగ్గుమంటున్న కూరగాయల ధరలు శరాఘాతంలా మారాయి. ఏడాది వ్యవధిలో నిత్యావసర వస్తువుల ధరలు దాదాపు 50 శాతం పెరిగితే..బియ్యం 13-25 శాతం వరకు పెరిగింది. నెల నెలా వచ్చే అరకొర జీతం తమ అవసరాలకు సరిపోక అప్పులపాలవుతున్న పరిస్థితుల్లో కుటుంబ నెల బడ్జెట్ తలకిందులవుతున్నది. జీవనాన్ని సాగించడం పెద్ద యుద్ధంగా మారిపోయిందని రంగారెడ్డి జిల్లాలోని పేద, మధ్య తరగతి ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేస్తున్నది. ధరల పర్యవేక్షణ కమిటీ ప్రతినెలా సమావేశం నిర్వ హించి ధరలు, విక్రయాలపై చర్చించాలి. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తే తగు చర్యలు తీసుకోవాలి. కానీ..ఇది పక్కాగా అమలుకావడం లేదు. దీంతో గత కొంతకాలంగా ధరలు పెరుగుతూనే ఉన్నాయి.





శంకర్‌పల్లిలోని కూరగాయల దుకాణం

## ధరలు భారీగా పెరిగాయి..



నిత్యావసరాలతోపాటు కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. పంటలు పండు తున్నా ధరలు మాత్రం తగ్గడం లేదు. టమాటాలను కిలో రూ.50కి తగ్గకుండా అమ్ముతున్నారు. గత రెండు, మూడు నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నది. వారానికి కూరగాయల కొనుగోలుకు రూ. 800 నుంచి 1000 వరకు ఖర్చు చేయాల్సి వస్తు న్నది. నిత్యావసర ధరల గురించి మాట్లాడుకోకపోవడమే మంచిది. కేవలం మధ్య వర్తులతోనే ధరలు పెరుగుతున్నాయి.

– భూషం నరేశ్‌కుమార్, భాగ్యనగర్ కాలనీ, షాద్‌నగర్

# శోభాయాత్ర రూట్లు ఇవే..




- బాలాపూర్ నుంచి వచ్చే గణేషుడి శోభాయాత్ర చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా రైల్వే ఓవర్ బ్రిడ్జి, నాగుల చింత, చార్మినార్, అఫ్జల్‌గంజ్, ఎంజే మార్కెట్, అబిడ్స్, బషీర్‌బాగ్, లిబర్టీ, అంబేద్కర్ విగ్రహం, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు వరకు జరుగుతుంది.
- సికింద్రాబాద్ వైపు వచ్చే గణనాథులు ఆర్పీరోడ్డు, ఎంజేరోడ్డు, కర్బాలమైదాన్, కవాడిగూడ, ముషీరాబాద్ క్రాస్ రోడ్డు, ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, నారాయణగూడ క్రాస్ రోడ్డు, హిమాయత్‌నగర్ వై జంక్షన్ నుంచి ప్రధాన యాత్రలో కలుస్తాయి.
- చిలకలగూడ వైపు నుంచి వచ్చే యాత్ర గాంధీ దవాఖాన వద్ద నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్, నారాయణగూడ ఫ్లై ఓవర్, నారాయణగూడ వై జంక్షన్, హిమాయత్‌నగర్ నుంచి లిబర్టీ వద్ద ప్రధాన ర్యాలీలో కలువాలి.
- ఉప్పల్ వైపు నుంచి వాహనాలు శ్రీరమణ జంక్షన్, 6 నం. జంక్షన్, తిలక్‌నగర్, శివం రోడ్డు, ఎన్‌సీసీ, విద్యానగర్ టీ జంక్షన్, హిందీ మహా విద్యాలయం, ఫీవర్ ఆసుపత్రి, బర్కత్‌పురా, వైఎంసీఏ, నారాయణగూడ ఎక్స్ రోడ్స్, ఆర్టీసీ క్రాస్ రోడ్డు వైపు నుంచి వచ్చే ర్యాలీలో కలుసుకోవాలి.
- అలాగే దిల్‌సుఖ్‌నగర్, ఐఎస్ సదన్, సైదాబాద్ వైపు నుంచి నల్లగొండ క్రాస్‌రోడ్ వైపు నుంచి వచ్చే భారీ వాహనాలు మూసారాంబాగ్, అంబర్‌పేట్ మీదుగా హిమాయత్‌నగర్ వైపునకు వెళ్లి ప్రధాన ర్యాలీలో కలువాలి. అలాగే తార్నాక నుంచి వచ్చే వాహనాలు ఫీవర్ ఆసుపత్రి వద్ద నుంచి ప్రధాన ర్యాలీలో కలువాలి.
- టోలిచౌక్, మెహిదీపట్నం వైపు నుంచి వచ్చే వాహనాలు మాసబ్‌ట్యాంక్, ఓల్డ్ సైఫాబాద్, ఇక్బాల్ మినార్ నుంచి ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకోవాలి. ఎర్రగడ్డ, ఎస్ఆర్‌నగర్, పంజాగుట్ట, ఖైరతాబాద్ వైపు నుంచి నిరాంకారి వద్ద యాత్రలో కలువాలి. ఆసీఫ్‌నగర్ సీతారాంబాగ్, అగాపురా, గోషామహల్, అలాస్క, మాలకుంట జంక్షన్ నుంచి వచ్చే యాత్ర ఎంజే మార్కెట్ వద్ద ప్రధాన యాత్రలో కలువాలి.

# ట్రాఫిక్ ఆంక్షలు

లారీలు, జిల్లాల బస్సులకు ఉదయం 8 గంటల నుంచి సిటీలోకి నో ఎంట్రీ



గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో ట్రై పోలీస్ కమిషనరేట్లలో 25 వేల మంది పోలీస్ సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నారు. ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన కార్యక్రమం ఉదయం వేళల్లోనే ప్రారంభించి.. మధ్యాహ్నం వరకు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించారు. ఇక లడ్డూ వేలం పూర్తయిన తర్వాతే బాలాపూర్ గణేషుడిని నిమజ్జనానికి తరలిస్తారు. మరోవైపు ప్రధాన శోభాయాత్ర జరిగే మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని సీపీ ఆనంద్ వెల్లడించారు. నగరంలోని అన్ని జంక్షన్లలో ఆంక్షలు ఉంటాయని.. బషీర్‌బాగ్ కూడలిలో మాత్రమే ఇరువైపులా రాకపోకలకు అనుమతి ఉంటుందన్నారు. వాహనదారులు ఇన్నర్ రింగ్ రోడ్డు, బేగంపేట ప్రాంతం, ఔటర్ రింగ్ రోడ్డును ఉపయోగించుకోవాలని సూచించారు. లారీలు, జిల్లా బస్సులకు నగరంలోకి ఉదయం 8 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు అనుమతి ఉండదన్నారు. శివారు ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించాలని సూచించారు. ట్రాఫిక్ ఆంక్షల నేపథ్యంలో హెల్ప్‌లైన్ నంబర్ల (040-27852482, 8712660600, 9010203626)ను సంప్రదించాలని సీపీ సూచించారు. కాగా, నిమజ్జనోత్సవాల్లో భాగంగా ఎవరైనా సోషల్ మీడియాలో ప్రజలను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టినా.. తప్పుడు ప్రచారం చేసినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనర్లు హెచ్చరించారు.

- సిటీబ్యూరో



సోమవారం రాత్రి గణనాథుడి నిమజ్జనాలతో ట్యాంక్ బండ్ రోడ్డు ఇలా కోలాహలంగా మారింది. మరోవైపు బీఆర్ఎస్ హయాంలో నిర్మితమైన సచివాలయం, అమరజ్యోతి విద్యుద్దీపాల వెలుగులో ఇలా ధగధగమెరిసిపోతూ.. భక్తులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి.

## పార్కింగ్ స్థలాలు ఇవే..

నిమజ్జనం వీక్షించేందుకు వచ్చే భక్తులు తమ వాహనాలను ఎన్టీఆర్ స్టేడియం, కట్టమైసమ్మ టెంపుల్, లోయర్ ట్యాంక్‌బండ్, పబ్లిక్ గార్డెన్స్, బుద్ధ భవన్ వెనుక వైపు, ఆదర్శనగర్ రోడ్డు, బీఆర్‌కే భవన్, జీహెచ్ఎంసీ రోడ్డు, ఖైరతాబాద్ జంక్షన్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ జంక్షన్, ఎంఎంటీఎస్ స్టేషన్ (ఖైరతాబాద్)లో పార్కింగ్ చేసుకోవాలని అధికారులు సూచించారు.



## అర్ధరాత్రి వరకు మెట్రో



గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో ఉదయం 6 నుంచి అర్ధరాత్రి 1 గంట వరకు (అన్ని టెర్మినల్స్ నుంచి చివరి రైలు) అన్ని మార్గాల్లో మెట్రో సేవలు అందుబాటులో ఉంచినట్లు ఎల్ అండ్ టీ, హెచ్ఎంఆర్ఎల్ వర్గాలు తెలిపాయి. అలాగే భక్తుల కోసం గ్రేటర్ వ్యాప్తంగా ఆర్టీసీ 600 ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు.



## నిమజ్జనం.. జరపైలం

గణనాథుడి శోభాయాత్రకు భారీగా భక్తులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే.. ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని నిపుణులు అంటున్నారు. చిన్నా.. పెద్ద అందరూ నిమజ్జనానికి తరలివెళ్తారు. అయితే పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలంటున్నారు. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉండకుండా..వారిని నిరంతరం కంట కనిపెడుతూ.. ఉండాలని, లేదంటే వారు జనంలో తప్పిపోయే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు. అలాగే నిమజ్జనం తరలించే వాహనాలపై పరిమితికి మించి భక్తులు ఎక్కించడం మంచిది కాదని సూచిస్తున్నారు. నిమజ్జన యాత్రలో డ్యాన్సులు, సంగీతం శృతి మించకుండా ఉండేలా నిర్వాహకులు చూసుకోవాలంటున్నారు. ముఖ్యంగా విద్యుత్ తీగలతో మరింత అప్రమత్తంగా ఉండాలంటున్నారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన 2008 డీఎస్సీ అభ్యర్థులు

# న్యాయం చేయండి..

### సీఎంకు విజ్ఞప్తి చేసిన 2008 ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులు

వికారాబాద్, సెప్టెంబర్ 16 : 2008 డీఎస్సీలో క్వాలిఫై అయిన ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలని.. పలువురు సోమవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ.. డీఎడ్ 2007, 2009 ప్రైవేట్ డీఎడ్ అభ్యర్థులకు అవకాశం ఇచ్చి.. తమకు మాత్రం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పేర్లు మెరిట్ జాబితాలో వచ్చాయని.. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా జరిగిందని వివరించారు. స్పందించిన సీఎం.. ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంను కలవాలని సూచించారు.

కార్యక్రమంలో కిశోర్, వెంకటేశ్, అనూష, పద్మ, సంధ్య, సునీత, మంజుల, గీతాంజలి, ప్రవీణ్, జైపాల్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.